నేటి మనిషి

"కనక్ ప్రవాసి"

ముందు ఎండలో పేవ్‌మెంట్ మీద విసురుగా నడిచి వెడుతున్నాడు కనకం. అతని ముఖం చూస్తే దూరంగా దేన్నో ఆశించి వెడుతున్నట్టు, కలవరపడుతున్నట్టు తెలుస్తూంది. ఇటూ అటూ చూడకుండా దేన్నో అందుకుందామన్నట్టు కంగారుగా తిన్నగా వెళ్లిపోతున్నాడు. అతనిలో ఏ ఆలోచనా పనిచేయడంలేదు. అంతకు ముందుగా తాను హోటల్‌లో కాఫీ త్రాగి అయ్యరుకు ఎంత ఇచ్చాడు? ఆరుకాన్లా బేడా? ఆరుకాన్లయితే ఫరవాలేదు. బేడైతే తిరిగి అర్ధణా ఇచ్చాడా? ఏమో లాల్చీ జేబు తడుముకున్నాడు. చేతికి సమాధానంగా అర్ధణా తగల్లేదు. తను ఇచ్చిందే ఆరుకాన్లేమో! అచ్చే బేడ ఇచ్చినట్లు జ్ఞాపకం, ఐతే అర్ధణా మోసం చేశాడా! వెధవ అర్ధణా. అసలు డబ్బులు మిగిలాయో లేదో అనే ఆలోచన ఎందుకు రావాలి తనకి? నడుస్తున్నంతసేపూ అదొక్క ఆలోచనే అతనిలో తీవ్రంగా పనిచేసి తిరిగి తిరిగి ప్రశ్నించింది. కనకం ఆలోచిస్తూనే నడుస్తున్నాడు.

అతనికి అర్ధణానుగురించి ఆలోచన రావటం అదే తొలిసారి. "అర్ధణానుగురించి ఆలోచించటమేమిట"ని అతనికి సిగ్గేసింది. అంతకుముందెప్పుడూ అతనికి రూపాయికి తక్కువ ఆలోచనరాలేదు. అందువల్లే గబుక్కున ఒక్కసారిగా దిగిపోయే వేమిటని సిగ్గేసివుంటుంది. ఇప్పుడైనా తన ఆర్థిక స్థితి పూర్తిగా అనారోగ్యంగా ఉండడంచేత గాని కాకపోతే ఆ అర్ధణా గురించి ఆలోచించి ఉండకపోను. అయినా అతను ఆ అర్ధణాతో చేయవలసిన ఘనకార్యం కూడ ఏంలేదు. కాని ఉంటే ఎందుకైనా ఉపయోగపడునే, అని విచారించాడు. అతనికా ఆలోచన, విచారం చాలా నీచం అనిపించింది. కాకపోతే నెలకి నూటపది రూపాయలు తెచ్చుకుంటున్నాడాయె! సిగ్గుకాదు మరీ? పిల్లాపీచు లేదు. తనూ, పెళ్ళాం అంతే. మధ్య మధ్య మావగారు పాతికోపరకో పంపకపోతే గతి లేదన్నట్టు కూర్చుంటాడు. అడపాదడపా అన్నగారుకూడ అతనికి మనియార్డరు చేస్తూనే వుంటాడు. తనకన్న తక్కువ తెచ్చుకొనే మిత్రులదగ్గరికే ఎప్పుడూ అప్పుకి బయలుదేరతాడు. అదే అలవాటులో స్నేహితుడిదగ్గరికి బయలుదేరాడు. త్వరత్వరగా నడుస్తున్నాడు కనకం, ఏదో కొంపమునిగినవాడిలా. మూడు అణాలు వుంటే రిక్షా ఎక్కేవాడే. అతనికి ప్రస్తుతానికి అయిదురూపాయలైతే చాలు. కావలసిందీ, కోరదగ్గదీ ఇంకేం లేదు.

ఆవేళ ఆదివారం. కనకం, అతని భార్యా ఇంగ్లీషు ఫిల్ముకి వెళ్ళాలని గట్టిగా నిశ్చయించుకున్నారు. ఇంటివారి అమ్మాయి కూడా తమతో రావాలని సరదా పడుతున్నట్లు కనకం గ్రహించాడు. అతనికి జీతం అంది ఇంకా పదిరోజులైనా కాలేదు. అప్పుడే బయలుదేరాడు అప్పు తెచ్చుకోటానికి! ఇంత జీతం వస్తూంది, ఇంత ఖర్చవుతూంది అని ఎప్పుడూ అతను లెక్కవేయటానికి ప్రయత్నించలేదు. దానికి కారణం అతని కంతవరకూ ఏ నెలా మిగిలేటట్లు కనిపించకపోవడంవల్లె అయుండాలి. ఈ నెల ఇట్లా అయింది, మరుసటి నెల అయినా జాగ్రత్తగా వాడుకుందాం అని అతను ఎప్పుడూ పశ్చాత్తాపపడలేదు. అవసరానికి డబ్బు దొరకని పక్షంలో పశ్చాత్తాపపడేవాడేమో. అవసరానికి ఎప్పుడూ అతనికి అప్పు దొరుకుతూనేవుంది. అదే ఆశ సినిమాకు వెళ్లడానికి అయిదు రూపాయల కోసం మంచి ఎండలో స్నేహితుడింటికి మైలుదూరం నడిపించింది.

కనకం వీధిలో నిలబడే "సుబ్బారావ్! సుబ్బారావ్!" అని పిలిచాడు స్నేహితుణ్ణి. ఎవరూ పలకలేదు. కాస్సేపు ఆగి మళ్ళీ పిలిచాడు. ఎవరూ పలకలేదు. ఆ ఇంటికి తాళం వేసిఉండటం చూసి సిగ్గుపడుతూ విసుగ్గా అక్కడినుంచి బయలుదేరాడు. కనకానికి మంచి ఆలోచన తట్టింది. పోనీ రాజా నడిగితే! అంతకుముందే తను రాజుకి నాలుగుంపావలా ఇవ్వాల్సినమాట జ్ఞాపకం వచ్చింది. బాగుండదేమో అని సందేహించాడు.

"ఆఁ, బాగోకపోవడం ఏమిటి! అదీ, ఇదీ ఏకంగా ఒకేసారి కలిపి ఇవ్వచ్చు" అని సమాధానం చెప్పుకొని ధైర్యంగా రాజును పిల్చాడు. రాజు పెద్దకొడుకు పన్నెండేళ్లవాడు కనకందగ్గరగా వచ్చి రహస్యంగా "మానాన్న చేతిలో లెఖ్ఖలేక మీదగ్గరకి వెడతానని చెప్పి వెళ్లారు. రాలేదా?" అని అడిగాడు. "రాలేదు" అనే చిన్న సమాధానంకోసం కనకం తడుముకున్నాడు. ఇదే సమయంలో తన దగ్గరకే రాజుకూడ బయల్దేరటమేమిటని కనకానికి పెద్దకోపం వచ్చింది. తన కియ్యాల్సివస్తుందని తనదగ్గరకే బయల్దేరాడా, అన్నట్లు ఫీలయ్యాడు కనకం. నిజానికి కనకం ఎప్పుడూ ఇంత ఇబ్బందిపడలేదు. ఎప్పుడు అడిగినా వాళ్లు లేదనకుండా అతనికిచ్చేవారు. అతను ఎప్పుడూ అప్పులు తీర్చడం ఆలస్యమే! అయినా వాళ్లు సాధారణంగా అడిగేవాళ్లేకాదు. కనకానికి యిక ఒక్కటే ఆలోచన తట్టింది. భాస్కరాన్ని వెళ్లి అడిగితే—"తనతో మాట్లాడడం తగ్గించేసి తనదగ్గరకే అప్పుకోసం వెడితే ఏమనుకుంటాడో వాడు?" అని కనకం ముందు బాధపడ్డాడు.

"ఆఁ ఏమనుకుంటాడేం! తనతో మళ్ళీ బాగా మాట్లాడుతున్నాడే అని అది[illegible]ల పెట్టుకోనేందుకైనా వెంటనే ఐదూ ఇవ్వడూ!" అని నమ్మి బయలుదేరాడు.

కాని కనకం దురదృష్టమేమిటో, భాస్కరం ఊళ్లోలేడని అతని శ్రీమతి జవాబు చెప్పింది. సిగ్గు విడిచి, ధైర్యంగా ఆవిడనే ఒక్క అయిదురూపాయల నోటు బదులు అడుగుదామనుకున్నాడు. ధైర్యమైనవాడే. అడగ్గలడు. కాని అతనిలో ఏమూలో దాగివున్న మగతనం పరిహసించింది. దాంతో తలవంచుకొని మరి చూడకుండా నడక సాగించాడు.

అయోమయంలో మందంగా నడుస్తున్నాడు కనకం. అవమానాన్ని అంటిపెట్టుకొని నడుస్తున్నాడు. అయిదురూపాయలు పుట్టలేదంటే అతనికి సి[illegible]ంది. ఉద్యోగంలో ప్రవేశించిన రెండేళ్లనుంచీ అతనికి అప్పు పుట్టకపోవడమనేది జరగలేదు. అంతకుముందు చదువుకునేటప్పుడు కూడ ఎప్పుడూ అప్పులే. ఇంటినుంచి

ఎమ్. ఒ. రావటం తడవుగా అతని రూమ్ మేట్సు అతన్ని హోటలుకు దారితీయించే వాళ్లు, ఏజన్మానా టిఫెన్ ముఖం ఎరగని వాళ్లలా. ఆ రాత్రి అందరూ సినీమాకు తప్పరుకదా! వాళ్ల డ్రింకులకూ, సిగరెట్లకూ తనే ఇచ్చేవాడు. ఏకొంతో హోటలుకు చెల్లించేవాడేమో. మళ్లీ నాలుగురోజుల్లో ఇంకో ఎమ్. ఒ కోసం ఎదురుచూడటంతో సరిపోయేది. వాళ్ళ గదిలో పంతులూ, రాజూ కూడ అంతే పద్ధతి. ఇక ఎవడికి కావలసినంత వాడు అప్పులకు బయలుదేరడం. వాళ్ళు ముగ్గురూ విడుదలైన ఏ కొత్త సినీమా మానేరని? ఒకే సినీమా ఎవళ్లెక్కువసార్లు చూశారో అనే పోటీ కూడ. ఆ సినీమా బాగున్నదా లేదా అనికాదు, అది మరోసారి చూశామా లేదా అన్నదే లెక్క. మళ్లీ మనియార్డరు చాలాభాగం అప్పులు తీర్చడానికే సరిపోయేది. ఇక జరగబోయే నెల గడిచేదెలాగ? కనకం సెలవులకి ఇంటికి వెడితే అమ్మ అనేది: "నెలకి ఎనభై ఐదు పంపుతున్నా చాలలేదనే గోలే! వాళ్ళ సుబ్బారావుకి ఏభై ఐతేనే సరిపడుతున్నాయట. ఈవేళ ఇంత ఖర్చు జేస్తున్నామంటే కాదు. కొంచెం ముందు సంగతికూడ ఆలోచించుకోవాలి. ఈవేళ నాన్న సంపాదించి పెడుతున్నారంటే సరి కాదు. కాలూ, చెయ్యీ వంగితే తెచ్చేదెవరూ? ఆలోచించరేం?"

"మీ సంసారాలు ఎట్లా గడుస్తాయో నాకర్థంకాదు. ఇట్లా గుడ్డిగా ఖర్చుచేస్తే ఎట్లా చెప్పు?" అని నాన్న అనేవాడు. తనకి జ్ఞానం వచ్చినప్పటినుంచి నాన్న చేసే ఖర్చుకి అమ్మ సాధించిపోయడం కనకం వింటూనే ఉన్నాడు. నాన్న కేకలేసి అమ్మ నోరు మూయించేవాడు. చేసేదేంలేక బెంగపెట్టుకొని, ఏం జరగాల్సివుంటే అదే జరుగుతుందని అమ్మ సరిపెట్టుకొనేది. అప్పుడు కనకానికి యిదంతా ఏదో మామూలు విషయంగానే తోచింది. ప్రతి సంసారంలోనూ ఇట్లాంటి గొడవలు ఉంటూనే ఉంటాయని మాత్రమే అతను భావించాడు. ఆ డబ్బు బాధ తనకింతవరకు ఎప్పుడూ గట్టిగా తెలిసిరాలేదు. "అమ్మ చెప్పినట్లు తన స్థితి ముందుగతి లేకుండానే సాగుతుందా?" ఆ ఆలోచన అతన్ని వణికించింది. ముచ్చెమటలూ పోశాయి. ఏదో జ్ఞానోదయం కలుగుతున్నట్లు అతనికి తోచింది. నడుస్తూనే సిగరెట్ తీసి వెలిగించాడు. ఒక్క దమ్ము లాగేసరికి ప్రస్తుతావసరంలోకి కళ్ళు తెరుచుకున్నట్లు అనిపించింది. అప్పటికప్పుడే రైలుస్టేషన్ దగ్గరకి వచ్చేసినట్లు గుర్తించుకోగలిగాడు. ఇంత

సిగ్గువిడిచి, ధైర్యంగా ఆవిడనే ఒక్క అయిదు బగులు అడుగుదామనుకున్నాడు......కాని అతనిలో ఏమూలో దాగివున్న మగతనం పరిహసించింది.

దూరం ఎట్లా నడిచివచ్చానా అని అతనికి ఆశ్చర్యమేసింది. స్టేషన్లోకి పోయి కూర్చున్నాడు, వచ్చేపోయే రైళ్లను చూస్తూ. అందులో అతనికేదో గొప్ప ఆనందం కనిపించింది.

ఇంక ఎప్పుడూ ఎవరిదగ్గరా అప్పు పుచ్చుకోకూడదనుకున్నాడు కనకం. అనుకున్నాడేకాని నిశ్చయించుకోలేదు. ఇంకా నెలల్లో సగంకూడ గడవలేదు. వచ్చినజీతం

(55 వ పేజీ చూడండి)

మేస్టారు:- ప్రాణవాయువు లేకుండా, ఈ విశాల ప్రపంచంలో ఏ జీవీ బ్రతకదని, సుమారు 300 సంవత్సరాల క్రితం కనిపెట్ట బడింది.

శిష్యుడు:- ఐతే ఆసంగతి కనిపెట్టబడటానికి ముందు ఈ ప్రపంచంలో జీవరాసులు ఎలా జీవించి వుండేవండీ?

"మహేష్"

* * *

జ్యోతిష్కుడు:- మీ భార్యకూ మీకూ నాలుగేళ్ళ దాకా దెబ్బలాట లుంటూనే వుంటాయి.

ఆయన:- ఆతరువాత దెబ్బలాటలు రావా?

జ్యోతిష్కుడు:- వస్తాయి; అలవాటైపోతుంది కనుక భయంలేదు.

శ్రీ సిహెచ్. ఎస్ రావు, కాకినాడ.

నేటి మనిషి

(7 వ పేజీ తరువాయి)

అయిపోయి అప్పుకి బయలుదేరాడా? ఎట్లా పుచ్చుకోకుండా ఉండగలగడం! ఏది లేదన్నా రోజుకి పెకైసిగరెట్లకీ అర్ధరూపాయికి పైమాటే కాని తక్కువ కాదు. పోనీ అనవసరపు ఖర్చులు తగ్గిస్తే! సిగరెట్లు ఎలాగా తప్పవు. సినీమాలు తగ్గిస్తే తనకూ, శ్రీమతికీ అసలు జీవితమే నిష్ప్రయోజనం అనిపిస్తుందాయె. అతనికి ప్రతీదీ అత్యవసరపు ఖర్చులాగే కనిపించింది. ఆలోచిస్తున్నాడు.

ఇంతలో "కనకం! ఇక్కడున్నావేంరా?" అని పిలిచారు అతన్ని సమీపిస్తూ ఎవరో వెనకనుంచి. కనకం తలత్రిప్పిచూశాడు. వెంకటేశ్వర్లు! ఫోర్తుఫారం చదువుతుండగా తన రూమ్‌మేట్ - అవును తను మరచిపోయాడు. వెంకటేశ్వర్లు స్టేషన్‌లో "గూడ్సు క్లార్కు"గా పనిచేస్తున్నాడు.

"ఏంలేదురా ఇవాళ సెలవుకదూ!" అన్నాడు కనకం.

"సెలవైతే ఇక్కడెందుకూ ఏ సినీమాకో, ఎక్కడికో పోక?" అన్నాడు వెంకటేశ్వర్లు.

"అబ్బే! లేదులే!" అని నసిగాడు కనకం.

వెంకటేశ్వర్లు కనకం వాలకం పసిగట్టి "యేదైనా డబ్బుకావాలా" అని అడిగాడు కనకం అవసరం గుర్తించినవాడిలా.

"ఊఁ. కావాలి" అనటానికి కనకానికి వచ్చినంత పనైంది. ఎలాగైతేం వెంకటేశ్వర్లు దగ్గర అయిదూ తీసికొని కనకం మరిఆలోచించకుండా ఆనందోత్సాహ సంరంభంలో రిక్షామీద ఇంటికి చేరుకున్నాడు. వర్తమానస్థితి ఒక్కటే పట్టింది కాని కనకానికి భవిష్యత్తునుగూర్చి కించిత్తు కూడ బెంగలేదు. భవిష్యత్తు ఎప్పుడూ బాగుంటుందనే అతని గాఢవిశ్వాసం. ★



S. 206-50 TL